కుటుంబం

[కథానిక]

✽

— శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి —

రాత్రి సుమారు తొమ్మిదిగంటల వేళ...చేతితో తలుపు నెట్టేందుకు కూడా ఓపిక లేక, ఎల్లాగో బుజంతో తొలిగించి, పాతబొంతల మూటలు చిందర వందరగా ఉన్న కుక్కిమంచంమీద కూలబడ్డది వసుంధర.

ఆమెరాకకోసం గడియ యుగంగా ఎదురు చూసిన తల్లి సీతమ్మ ఆమె ఇంత నీరసంగా, దిగులుగా రావడంతో హతాశురా లయింది. ఆక్షణంలో ఆవిడలో రేగిన ఆగ్రహము ఇతరుల నెవ్వరినీ ఉద్దేశించి కాదు; ఈరకపు దైనందిన, ఆశా-నిరాశలకు అతీతమయిన ప్రశాంతస్థితిని ఇంకా తాను పొందలేదేమా అని ఆ క్రోధం.

"వసు రాలేదే? తలుపు చప్పుడయినట్టుంది!" అని పెరటిచీడీలోనుండి ప్రశ్న. అంతలోనే సీతమ్మ గారు తనను తాను సర్దుకొని "బాగుందండీ, ఇంత వేగిరం ఎలా వస్తుంది? ఇవాళ వాళ్ల స్కూల్లో ఏదో పెద్ద మీటింగుట-అందులో నువ్వు మాట్లాడితేనే కాని వల్లకాదన్నారట వాళ్ళ ఇనస్పెక్టరుగారు" అంది.

"అవునవును, మరిచిపోయేను, అదే అమ్మాయి పొద్దున్న చెప్పింది"

"మీ కన్నీ మరుపే! అది వచ్చేసరికి పది గంటలు దాటుతుంది. మీరు రొట్టెలుతిని పడుకోండి"

"ఎలాగ తినడం, అది వస్తే మందు తెస్తుందేమోనని చూస్తున్నాను."

"అవతల మీటింగాయను; పెద్దపెద్దవాళ్లతో మాట్లాడాలాయను: అటువంటప్పుడు ఎంత భక్తిశ్రద్ధలుంటేమాత్రం, జ్ఞాపకం ఉండొద్దూ? ఇంతకీ, అది తిరిగివచ్చేవేళకి ఏ దుకాణాలూ ఉండవు."

"నిజమేస్లే. కాని, అయితే ఏమీ లేదంటావా? ఆ డబ్బీలో కొంచెం నీళ్లువేసి తే."

"అలా పూటపూటకీ నీళ్ళు వేస్తే ఊరడానికి అదేం గనా, సముద్రమా? ఇందాకా పాలనారాయణ మొగుణ్ణడిగేను; నసిగినసిగి ఇచ్చేడు ఈ పిసరు."

"అయితే ఇంతసేపూ ఇచ్చేవు కావేం?"

"అప్పుడే ఇచ్చేస్తే ఈపాటికి మళ్ళీ కావాలనరూ?"

"ఏదో, ఈపూటకి ప్రాణం నిలబెట్టేవు!"

నల్లమందు దొరికిందన్న ఉత్సాహంతో, అప్పారావు పంతులు మంచంమీద లేచి కూర్చున్నాడు. సీతమ్మగారు, చాలాచోట్ల పింగాణీ ఊడిపోయిన పళ్లెంలో, పొట్టు బాగాతీయని గోధుమ పిండితో చేసిన రెండు రొట్టెలూ, ఒక పాతనిమ్మకాయ ముక్కా వేసి పట్టుకొనివచ్చింది.

రెండవరొట్టె చివరిముక్క తింటూ, ఆయన, సార్థకంగా "ఎందుకిన్ని కొంచెం చేసేవు రొట్టెలు?" అన్నాడు. ఆవిడ "కొంచెం లేదు, లావుగానే చేసేను. అయితే, ఇందాకా, పాపం, అప్పలమ్మకూతురు పొద్దున నించీ ఏమీలేదని ఏడిస్తే రెండురొట్టె లిచ్చేసేను.

అయినా ఇంకా ఉన్నాయి. నా కాదివారం; వసు 'అక్కడ మీటింగులో టీపార్టీలో తినివస్తాను, నా కేమీ అక్కరలే'దంది; మీకొక్కవలిస్తే మరిరెండు రొట్టెలు తీసుకొనివస్తా"నంది.

అప్పారావుపంతులులో నిగ్రహమనేది చాలా తక్కువ. కాని, పాపం ఎల్లాగో అన్నాడు: "వద్దు, నాకూ కడుపు నిండిపోయింది; అయినా టీపార్టీలలో వాట్లో ఏమిటి తింటుంది! అమ్మాయికి ఎంతో మొగ మాటం. అవి రెండూ దానికి ఉండనీ"అంటూ నడుము వాల్చేడు.

ఆవిడ 'ఇందఁడీ' అంది ఆయనచేతికి చుట్ట నందిస్తూ. ఆయన లేచి, అతి ఉత్సాహంగా చివర కొరికి, బల్లమీది బుడ్డిదీపానికి ముట్టించి పొగలో తన్మయుడయేడు.

* * * *

తల్లిదండ్రులమధ్య జరుగుతున్న సంభాషణ వసుంధరచెవులలో పడుతున్నదిగాని, ఆమెమనస్సుకి మాత్రం అందడం లేదు.

ఆరోజు ఉదయం ఎనిమిదిగంటలకు తాగిన కాఫీనీళ్లువినా ఆమె పచ్చిమంచినీళ్లుకూడా పుచ్చుకోక పోయినా ఆమె కేమీ ఆకలయినట్లు లేదు. అలా ఆ బొంతలమూటలమీద ఒరిగిఉండగానే ఆమెకు చిన్న కునుకు పట్టింది......

"అమ్మా, వసూ! లే అమ్మా, పొద్దుటా ఏమీ తినలేదు. ఈ రెండురొట్టెలూ తిని, ఇన్ని నీళ్లు తాగ మ్మా"అని సీతమ్మగారు లేపింది వసుంధరని.

ఆ కొద్దినిమిషాల నిద్రతో ఆమె తన మనో వ్యథలను చాలావరకూ మరిచిపోగలిగింది. అదివరకల్లా స్ఫుటంగా తెలియని ఆకలి అప్పుడు తెలిసింది. ఒక రొట్టె తినేదాకా తా నేమిటి తింటున్నదో కూడా తెలియనేలేదు. రెండవరొట్టె తినేవేళకు ఆమెకు స్ఫుర ణకివచ్చింది.

"అమ్మా, నువ్వేమేనా తిన్నావా, లేదా" అని అతి ఆతృతగా అడిగింది వసుంధర.

"ఇవాళ నాకు ఆదివారంకదమ్మా" అంది రాని నవ్వును బలవంతంగా తెచ్చుకుంటూ సీతమ్మగారు.

"బాగుందమ్మా, ఇవాళ ఆదివారం, నిన్న శని వారం, రేపు సోమవారం!—నీకు ప్రతిరోజూ ఏదో ఒక వారమే; నువ్వు తినకపోతే నేనూ తినను" అంది నిష్కర్షగా వసుంధర.

"లేదమ్మా, నాకొక్కవాలంటే తిననా? ఇంతకీ మునపటిలాగ అరగటం లేదు; ఏది తిన్నా, ఎంత కొంచెం తిన్నా కడుపులో భారంగానే ఉంటు న్నది—"

ఈ మాటలను వసుంధర ఎక్కువగా నమ్మలేదు; కాని అప్పట్లో ఆమెలో వాదించేశక్తి ఏమీ లేక పోయింది. ఆమె మళ్లీ రొట్టె కొరుకుతూఉండగా తమ్ముడు రామం పలవరించేడు—కలతనిద్రలో: "అమ్మా, అక్కయ్య తెచ్చే మిఠాయంతా నాదేనుసుమా" అని.

తల్లీకూతుళ్లిద్దరి కళ్లలోనూ ఆపుకోబడకుండా నీళ్లు గిఱ్ఱన తిరిగేయి. "అమ్మా, నేను మరి తినలే నమ్మా" అంది వసుంధర డగ్గుత్తికపడిన గొంతుతో. ఆమెపక్కలో కూర్చొని, "నా తల్లివి కాదమ్మా, ఉదయంనుంచీ ఏమీ తినలేదు. అలా మారాంచేస్తే ఎలాగమ్మా" అంటూ ఆమె నోటికి రొట్టెముక్కను అందించింది సీతమ్మగారు. ఆ క్షణంలో సర్వమూ సమృద్ధిగా ఉండికూడా ఎందుకో తనకే తెలియ కుండా మారాంచేసే చంటిపిల్లవలె తనను తాను భావించుకోగలిగింది వసుంధర, తనను నిత్యమూ కలవర పరిచే అంతులేని వ్యథలనన్నిటినీ మరిచిపోయి.

* * * *

సుమారు రాత్రి ఒంటిగంటప్పుడు తమ్ముడు రామంఏడుపుతో వసుంధరకి తెలివివచ్చింది. సీతమ్మ గారు తన జీవితంలోని ప్రముఖభాగమయిన అబద్ధా లతో మరిపించి ఊరుకోబెట్టాలని చూస్తున్నది. కాని, వాడు ఊరుకోవడం లేదు. పాపం, వచ్చీరాని జ్ఞానం!

"ఆఁఆఁ! అక్కయ్య తెచ్చిన మిఠాయి మీ రంతా తినేసిఉంటారు"—ఇదీ వాడి ఏడుపు.

"లేదమ్మా, అది నూనెమిఠాయిట; తింటే జబ్బు చేస్తుందని అక్కయ్య తేలేదు."

"అయితేమరి, నువ్వు రొట్టెలూ అవీ నూనెతో చేస్తే అవిమాత్రం జబ్బుచెయ్యవేమిటి? నీవన్నీ అబద్ధాలే."

"లేదమ్మా, అక్కయ్యేగాని తెస్తే, నిన్ను లేపకుండా, నీకివ్వకుండా ఉంటుందా? అసలు, రేపు వాళ్ళస్కూల్లో పెద్ద నాటకం వేస్తారట. అందులో నువ్వు కృష్ణుడి వేషం వేస్తావా, రామం!"

"వేస్తానుగాని, ఉత్తినాటకమేనా?"

"బాగుంది, ఉత్తినాటకమేనా, మధ్యాహ్నం పెద్ద విందు చేస్తారు. అందులో నీదే రాజ్యం; కావలసినన్ని జిలేబీలు, లడ్డూలు, బరిపీలు, కోవాబిళ్ళలూను."

"నిజమేనా అమ్మా."

"నిజమేనమ్మా, మరి నిద్రపో, ఉదయమే లేద్దువుగాని: అక్కయ్య లేచే వేళకి."

"అలాగేకాని, నిద్ర రావడం లేదమ్మా. మరొక్క రొట్టె లేదూ?"

అంతవరకూ ఎల్లానో అణచుకోబడిన దుఃఖం మరి ఆగింది కాదు వసుంధరకి. మెల్లిగా లేచి వీథి గుమ్మంలోకి వెళ్ళిపోయింది తన ఏడుపు వినబడకుండా ఉండేందుకు.

కాని సీతమ్మగారి కిదేమీ కొత్తకాదు. అనుక్షణమూ ఎన్నెన్నో అబద్ధాలాడి మరిపించడంలోనూ, సర్దుబాటుచెయ్యడంలోనూ ఆవిడ ఆరితేరిపోయింది.

"అబ్బే, ఇంతరాత్రప్పుడు ఎవళ్ళయినా రొట్టెలు తింటారా? తెల్లవారి లేచేక నీకు కావలసినన్ని"—ఎప్పుడూ తనకు కావలసినన్ని రొట్టెలు అమ్మ ఇయ్యకపోయినా, ఆమెమాటలను నమ్మకుండా ఉండలేకపోయేడు రామం.

"మరి నిద్రరావడం లేదమ్మా" అన్నాడు రామం.

"అయితే, కథ చెప్పమునా? ఏకథ చెప్పేది, శ్రీరాములవారి కథా? పాండవుల కథా? ప్రహ్లాదుడి కథా? ధ్రువుడి కథా? ఏంకథ చెప్పేది?"

"ఏంకథా, చిన్నికృష్ణమ్మకథ చెప్పమ్మా."

"అలాగే. అయితే మరి కళ్ళు మూసుకో."

చిన్నికృష్ణుడు ఎన్ని వెంకితనాలు చేసినా మంచివాడుగానే పరిగణించబడడమూ, చిన్నికృష్ణుడు చిన్నవాడైనా ఎన్నెన్నో అద్భుతశక్తులను కలిగిఉండడమూ, అన్నిటికంటె ముఖ్యంగా చిన్నికృష్ణుడు తన కడుపునిండానేకాకుండా, నేస్తులందరి కడుపులూ నిండేటట్లుగా పాలూ వెన్నా మీగడా దొంగిలించి పంచిపెట్టి ఆనందించి ఆనందింపజేయడమూ మొదలయినవన్నీ వినటంలోని తన్మయానందము ఆపిల్లవాడి ఆకలిని కొంతసేపు మరిపించగలిగింది. తనకు వాస్తవికజగత్తులో ఎన్నడూ లభ్యంకాని పదార్థాలనుగూర్చిన భావనతోనే ఆ పసిమనస్సు తృప్తిపడగలిగింది. కథ వింటూ వింటూ తానే చిన్నికృష్ణమ్మయేమో అనికూడా అనుకో గలిగింది ఆ లేతమనసు.

రామం నిద్రపోయే వేళకి సీతమ్మగారి కళ్ళు కూడా బరువెక్కాయి. ఆ నిద్రమత్తులో రామానికి నిద్ర పట్టిందని తెలియకుండానే, మరికొంతసేపు ఆమె ఏమేమిటో అస్పష్టంగా, అసంబద్ధంగా చెప్పుకుపోసాగింది.

".........అప్పుడుట, ఆ గోపికలుట,...... చిన్నికృష్ణమ్మా, నీకు కావలసినన్ని రొట్టెలూ అవీ ఇస్తాము......నిన్ను మీ అమ్మ రోలుకి కట్టేస్తే..." అంటూ ఆమె నిద్రలో మునిగిపోయింది.

అప్పటికి వసుంధర మళ్ళీ తేరుకుంది. ఇంట్లోకి వచ్చి ఆ చిరిగి జీర్ణమయిన బొంతమీద, మూడువంతులు శిథిలమయిన బట్టతో పడుకొనిఉన్న తల్లినీ, సగంసగం మండే ఆకలిమంటను కథలతో, రేపటికబుర్లతో, ఆధారంలేని ఆశలతో తీర్చుకునే చిట్టితమ్ముణ్ణీ చూడలేక, బుడ్డిదీపాన్ని మరీ చిన్నది చేసి పక్కమీద నడుమువాల్చి గట్టిగా కళ్లుమూసుకొంది నిద్రవస్తుందేమోనన్న ఆశతో. కాని, అంత సులభమయినదా నిద్ర? అందులోనూ మనఃప్రభవానలం నాలుగువంకలా దహిస్తూఉండగా నిద్రాచ్ఛాయలనేవి తాటాకులకంటే కూడా తేలికగా దహ్యమానము లవుతాయి.

* * * * *

అప్పారావుపంతులు తన చిన్నతనంలో ఎన్నడూ ఉద్యోగం చెయ్యవలసివస్తుం దనుకోలేదు. కాని, తండ్రి పోయిన రెండేళ్లలో ఆస్తి యావత్తూ హారతికర్పూరంకంటే విచిత్రంగా హరించిపోయింది. నౌఖరీచెయ్యడం తప్పనిసరి అయింది.

అంతటి అమాయకుడు తాలూకాబోర్డుహెడ్డు క్లార్కుగా పదిహేనేళ్లు పనిచేసేడంటే ఎవ్వరికైనా ఆశ్చర్యం కలగకపోదు.

ఆఫీసుబంట్రోతులు మొదలు పెద్ద కలెక్టరుగారి వరకూ అందరికీ తెలుసు అప్పారావు పంతులుకు అధమం లంచాలుపుచ్చుకోవడమయినా చేతకాదని. అయితే ఏమిటిలాభం? కేసంతా అతనికి విరుద్ధంగానే నడిచింది. అలవాటుచొప్పున అలా పనిచేసుకుపోవడాన్నే అతడి మనస్సు నేర్చుకుందిగాని ఇటువంటి విపరీతసంఘటనను ఎదుర్కొనే శక్తి దానికి లేకపోయింది. విచారణలో ఒక్కవిషయంకూడ సమంజసంగా చెప్పలేకపోయేడు. అయితే అధికారుల అనుగ్రహంవల్ల శిక్ష (జెయిలు) పడకుండా ఉద్యోగం పోవడంతో ఒడ్డెక్కగలిగేడు.

ఆ ఊళ్లో మరి ఉండలేకపోయేడు. ఎక్కడికయినాసరే, ఈఊరు తప్పిపోతే చాలుననుకున్నాడు. అప్పటికి వసుంధర చదువుమాని రెండేళ్లయింది; రామం నాలుగేళ్లవాడు. ఒకనాటి రాత్రి చీకటిలో, సుమారు రెండుగంటలవేళప్పుడు భార్యాభర్తలూ, ఇద్దరు పిల్లలూ ఎవ్వరూ గుర్తించలేని కొత్తపట్టణంలో రైలు దిగేరు.

ఆతరువాత కొన్నాళ్లు అప్పారావుపంతులు మళ్లీ ఏదైనా నౌఖరీకోసం నిష్ప్రయోజనంగా యత్నించేడు. చిట్టచివరకు, ఒక వర్తకుడు, మూడు నెలలు పద్దులు రాయించుకొని, "అన్నీ తప్పులే, ఇలాగయితే మేము మూడురోజులలో దివాలాఎత్తిపోమా?" అని పాతికరూపాయలు చేతిలో పెట్టేడు. ఏమేమీ ఇవ్వనంతకాలం ఎంతెంతో ఇస్తాడన్న ఆశయినా ఉండేది. ఈ పాతికరూపాయలనూ చించి, అతడిమొగం మీద చల్లి వేయాలనిపించింది. కాని, కోపం తెచ్చుకునే అధికారానికికూడా కొంత స్థితి ఉండాలికదా! పాతిక రూపాయలు తీర్చగల అవసరాలుకూడా ఎన్నెన్నో ఉండగా ఎంతకోపం వస్తేనేమి, లోలోపల అణిగిపోవలసిందే.

క్రమక్రమంగా ఆయనకు దగ్గు లావయింది. అందులోనూ చిరకాలంగా అభ్యాసమయిన నల్లమందు లేకపోయేసరికల్లా మరీ ఎక్కువయేది. ఏమయినా, ఎంతబాధయినా పడడానికి ఆయన అలవాటు పడిపోయేడుగాని, వీధిలోకి వెళ్లడమంటేమాత్రం ఆయనకు ప్రాణగొడ్డంగాఉండేది.

ఇంటిలో మిగిలిఉన్న కర్రసామానూ, ఇత్తడి వస్తువులూ మొట్టమొదట తాకట్టుపెట్టడమూ, తరవాత అమ్మివేయడమూతో కొంతకాలం గడిచింది. ఈ లోపున తక్కిన కుటుంబంకూడా కొంతవరకు కొత్త పరిస్థితులకు అనుగుణంగా జీవించటానికి అలవాటుపడిపోయింది.

*   *   *   *   *

ఏదో ఒక నిశ్చయం చేసుకున్నట్టుగా ఆమె ఒకనాడంది తల్లి సీతమ్మతో. "అమ్మా, నేనే కొడుకునయిఉంటే మిమ్మల్ని పోషించనుటమ్మా? ఇవాళ దగ్గరనుండీ నువ్వు ఎవళ్ల ఇంటికీ వెళ్లొద్దు. ఎవళ్లూ మనకు ఇచ్చేదీ లేదు, చచ్చేదీ లేదు; కాని, నానా ఇదీని."

"వాళ్లిస్తారనా, ఏదో అలా ఊసుపోక..."

ఈ ఊసుపోకపోవడానికి అర్థం 'ఇల్లుగడవక' అని.

"లేదమ్మా, ఈ ఫస్టునుండీ ఇక్కడి గర్ల్‌స్కూల్లో సంగీతంమేష్టరుగా పని దొరికింది. నెలకి పాతికరూపాయల జీతం ఇస్తారు."

కూతురు అంత సంతోషంగా చెప్పిన వార్తతో తల్లిమనస్సు చివుక్కుమంది. పద్ధెనిమిదేళ్ల నిండువయస్సులో, పెళ్లి—చీరలు—నగలు—సంసారం, ఏ ముచ్చటలూ లేకుండా తన అపురూపపు కూతురు పాతిక రూపాయలకు నౌఖరీచెయ్యడమా?

—అన్నాళ్లూ ఆవిడమనస్సులో, పరిస్థితుల దౌర్భాగ్యాన్ని ఎదుర్కొని, ఎక్కడెక్కడో ఆశా లేశము కొనసాగేది; ఏ విధంగానో ఆమెకు అద్భుత మయిన సంబంధము వస్తుందనీ, ఇంకా తన మనస్సులో సుఖజీవనము అంటే ఉన్న భావనకు అనురూపము లయిన సౌఖ్యాలన్నీ లభిస్తాయనీ ఆమె భావించగలి గేది. ఈ ఉద్యోగలబ్ధితో ఆమెఆశ నిరాశ అయింది.

*   *   *   *   *

బడిలో పనిచేయనిస్తున్నందుకు ప్రతిఫలంగా ప్రధానోపాధ్యాయురాలి కొడుక్కీ, కూతురుకీ రెండు న్నరగంటలు ప్రయివేటు చెప్పాలిట. ఏమయితేనేం, అన్నిటికీ సంతోషంగానే సిద్ధపడింది వసుంధర.

మొదట్లో ఆమెతెచ్చే పాతికరూపాయలూ సరి పడినట్టే ఉండేది కుటుంబానికి.

కాని క్రమక్రమంగా, సంగ్రామప్రభంజనోద్ధతి వల్ల ధరలు అల్లా ఉవ్వెత్తుగా పెరిగిపోవడంతో పయిగా ప్రయివేట్లు చెప్పి తెచ్చే డబ్బుకూడా చాల టంలేదు.

వస్తువుల ధరలకూ, వాటిని సంపాదించుకొనే కష్టానికీ అంటే ఒక మితి లేదుగాని, మనుష్యుల శక్తి పరిమితంకదా!

ఉదయం లేచిందిమొదలు రాత్రి పదిగంటల పర్యంతమూ కష్టపడికూడా వసుంధర కుటుంబపోష ణకు తగినపాటి సంపాదించలేకపోతున్నది. ఈ శ్రమ తో, నిత్యమూ ఉండే ఆందోళనతో, ఆమె పద్దెనిమి దేళ్లకే పాతికేళ్లు పైబడిన మనిషిలా తయారయింది.

సీతమ్మగారు ఇంటికద్ద పడే తాపత్రయము ఏమీ తక్కువకాదు—ఆమెకూడా ముప్ఫయిఅయిదేళ్లకే తల నెరిసిపోయి, శరీరపటుత్వం తగ్గిపోయి, యాభైఏళ్ళ మనిషిలా అయిపోయింది. పూర్వంలాగ ఎవరి ఇంటి కయినా వెళ్ళి సాయం చెయ్యలేకపోతున్నది; ఏ మాత్రం ఎక్కువగా కదలినా ఆలిక, గుండెలో భారంగా ఉండటం!

ఇక ఇంట్లో చిన్నపిల్లవాడు రామం—ఏమీ తెలియదు; అన్నిటికీ మారాము చేసేవాడు. కేవలం అవన్నీ తనకు అందనివని చెప్పలేకపోయేది ఆ తల్లి గుండె. ఏవేవో కారణాలు, సమాధానాలు కల్పించి చెప్పేది.

రామంకంటే పసిపిల్లవాడు అప్పారావుపంతులు. ఆయనకు చుట్టలూ, నల్లమందూ, కాఫీకూడా కావాలి విధిగా. అందులోనూ పనిపాటలు లేకపోవడంచేత అల వాట్లు మరీమరీ ఎక్కువయేయి. ఇన్నిటికీ డబ్బు ఎల్లా వస్తుంది అన్న విచక్షణజ్ఞానం ముసలి అప్పారావు పంతులులో నశించిపోయింది. ఎల్లాగో అదే (భార్య) తనకు కావలసినవన్నీ సమకూర్చుతుందనీ, అమ్మాయి ఏదో పెద్దఉద్యోగం చేసి కొల్లలుకొల్లలుగా ఆర్జించు తున్నదనీ ఆయనవిశ్వాసం.

వృద్ధాప్యం వచ్చేసరికి బాహిరదృష్టి ఎల్లా అస్ఫు టంగా అయిపోతుందో అల్లాగే ఆంతరదృష్టికూడా మందీభూతమవుతుంది కాబోలు. అప్పారావుపంతులు అప్పుడే కొత్తగా ప్రపంచంలోకి వచ్చిన వ్యక్తిలా ప్రశ్నించేవాడు లోకపు భోగట్టాలన్నీని. వసుంధర కూడా విసుగుకోకుండా, లేని ఉత్సాహం తెచ్చుకొని సమాధానా లిచ్చేది. సీతమ్మగారే "దానికి బడికి వేళ అయిపోతున్నది. అలా కబుర్లు చెప్తూకుంటూ కూర్చుంటే తండ్రీకూతుళ్ళకి ప్రపంచమే తెలీదు" అని అవధిలేని వారి సంభాషణకు ఒక హద్దు ఏర్పరిచేది.

*   *   *   *

ధరలు ఎక్కువకావడంవల్ల ఎంత బాధో, కంట్రోలువల్లకూడా అంత బాధగానే ఉండేది. ఎలాగో సీతమ్మగారు ఇరుగుపొరుగువాళ్ళ పిల్లలను తియ్యని మాటలతో మంచిచేసుకొని, బియ్యమూ, గోధు మలూ అవీ తెప్పించేది. ఆవిడమంచితనానికీ, తియ్యని మాటలకీ సాయంచెయ్యాలనే ఉండేది పిల్లలకు. కాని వాళ్ళ పెద్దవాళ్ళకుమాత్రం చాలా పరువుతక్కువగా తోచి ఆగ్రహం వచ్చేది. ఒక్కొక్కనాడు ఆవిడే స్వయంగా వెళ్ళవలసివచ్చేది బియ్యానికీ, పంచదారకీని.

ఉద్యోగంలో ప్రవేశించినతరువాత మరిరెండు చీరలుమాత్రమే కొనుక్కుంది వసుంధర; అంతే. ఆతరవాత రెండేళ్ళలోనూ మరి అట్టే సావకాశం లేకపోయింది.

*   *   *   *

తగిలినకాలికే(దెబ్బ) తగులుతుందన్న సామెతలో ఎంతో నిజం ఉంది. అసమం, దెబ్బ తగిలినకాలికే తగిలినప్పుడే బాగా తెలిసివస్తుంది.

తను అందరిలాగే స్కూల్లో పనిచేసి పొందే పాతికరూపాయలకు ప్రతిఫలంగా, ప్రధానోపాధ్యాయురాలి ఇంట్లో రెండున్నరగంటలు ప్రయివేటు చెప్పవలసిరావడం అప్పట్లో ఎంతో కష్టమనిపించినా తరవాత అదే మేలనిపించింది వసుంధరకి. ఏమంటే తరవాత వచ్చిన ప్రధానోపాధ్యాయురాలు వచ్చీరావడంలోనే క్వాలిఫికేషను లేదండి. ఇంకా ఎన్నెన్నో అభ్యంతరాలను చూపి ఉద్యోగంనుండి తొలగించింది. కేవలం ఉద్యోగం లేకపోయినంతమాత్రంలో అంత చిక్కు లేకపోవును. ఏమంటే, అప్పటికి, ఆమెకు తీరిక ఉంటే ఆమెదగ్గర చదువుకోవాలనేవాళ్లు, సంగీతం నేర్చుకోవాలనేవాళ్లు చాలామంది తయారయేరు. కాని, తనను ఉద్యోగంనుండి తొలగించటంతో తృప్తి కలగలేదు నూత్నప్రధానోపాధ్యాయురాలికి. ఊరల్లా బోలెడు ప్రచారం—"గొంతు బాగానే ఉంటుంది గాని, శాస్త్రజ్ఞానము ఏమీ లే"దని. ఈ దెబ్బకు తాళుకోవడం వసుంధరశక్తికి మించిపోయింది.—అందులో, తన శక్తిమీద ఇదివరకల్లా ఉండే ఆ నమ్మకమంతా అంతరించగా, ఏవేవో సానుభూతికబుర్లు చెప్పేవాళ్లంటే ఆమెకు మరీ కష్టంగా ఉండేది. ఇంతలా తనను పొడవడానికి ఏమిటోకదా తాను చేసిన నేరం? పోనీ, తనవెనుక భృత్యప్రాయుడుగా తిరిగే రామ్మూర్తికి ఉద్యోగం ఇప్పించుగాక, ఈ దరిద్రప్రచారం అంతా దేనికో? ఆవిషయంలో అంతకంటే మరి ఆలోచించలేకపోయేది వసుంధర.

ఆమెకు ఇంకొక విచారం. ఒక్క అమ్మకే తెలుసును- నాన్న కింకా తానేమో పెద్దఉద్యోగం చేసేస్తున్నాననే. ఆమెకు అబద్ధాలంటే అదొకవిధమైన అసహ్యం. కాని, తమ్ముణ్ణీ, నాన్ననూ తాత్కాలికంగా తృప్తిపరచటానికి అమ్మ ఆడే అబద్ధాలకి ఆమె క్రమంగా అలవాటుపడిపోయింది. అవునుమరి, నిజం చెప్పి తృప్తిపరచలేకపోవడమే కాకుండా, అబద్ధాలవల్ల కలిగే ఆభ్రాంతినికూడా ఎందుకు పాడుచెయ్యాలి?

ఈ కొత్తప్రచారంవలన ట్యూషన్లు చాలాభాగం కొత్తసంగీతంమాష్టరుగారికి సంక్రమించేయి. అయితే ఎవరోకొందరు, తమ పిల్లలకు మగవాళ్ళచేత సంగీతం చెప్పించటం ఇష్టంలేనివాళ్లు ఆమెచేతే చెప్పించేవారు. అయితే ఆ మునపటి మోజు లేదు. పైగా డబ్బిచ్చే వేళకు బేరంచెయ్యడమూ, బాకీలు పెట్టడమూ కూడా అలవాటయింది.

*   *   *   *

ఆవేళ ఉదయం ఆమె ఎంతయినా ఆశతో బయలుదేరింది. కాని, ఎండవేడి ఎక్కువవుతున్నకొద్దీ ఆమెఆశ పలచబారిపోసాగింది.

హైస్కూలు హెడ్మాష్టరుగారింట్లో తప్పక ఇస్తారనుకొంది-మూడు నెలలజీతం. మొదట్లో కొన్ని రోజులు ఇవాళ, రేపూ అనడం, ఆతరవాత క్రమంగా మళ్ళీ నెలజీతంతో కలిపి ఇస్తామనడం—ఇల్లాగ మూడు నెలలయింది. తమ జీతాలిలాగే పుచ్చుకుంటున్నారా?

ప్లీడరుగారి భార్య జానకమ్మ ఎంతో మంచిది. కాని ఆవిడచేతిలో దమ్మిడీకూడా ఉండదు. ఆమె ఎంతో అభిమానంగా పెట్టిన ఆ రెండు ఇడ్డెనలూ, కప్పుడుకాఫీయే ఉదయంనుండి ఆమెకు ఆధారం.

ప్రతిచోటా డబ్బుదొరుకుతుందేమో నన్న ఆశతో మామూలుకంటే అరగంట ఎక్కువగాకూడా కూర్చుంది. అసమం ఒక్క అయిదురూపాయలు దొరికినా ఆమె కొంత ఉల్లాసపడగలిగిఉండును. పన్నెండుగంట లవుతూండగా ఆమె ఇంటిమొగం పట్టింది.

సందుదగ్గరకి వచ్చేవేళకు ఆమెలో చిన్న బుద్ధి పుట్టింది. వట్టి చేతులతో ఇంటికి వెళ్లి ఏమి ప్రయోజనం? సాయంత్రం వెళ్లే బదులు ఇప్పుడే, మేజస్ట్రీటుగారింటికి వెళితే?—ఏమో అదృష్టం, ఎవరు చెప్పగలరు?

ఆమెమనస్సులో ఎంతయినా ఓపిక ఉందిగాని, అందుకు తగిన శక్తి శరీరంలో ఉండవద్దూ? డబ్బునూ, ఇంటినీగూర్చిన తన్మయధ్యానంలో ఆమెకు తెలియడం

లేదుగాని, నీరసంవల్ల అడుగుతీసి అడుగువెయ్యడానికి కూడా అసాధ్యంగా ఉంది శరీరానికి.

ఊరుచివరనున్న మేజస్ట్రేటుగారింటికి వెళ్ళడానికి రెండుదారు లున్నాయి. ఒకటి దగ్గరది, రెండవది చుట్టుదారీని. కాని ఆమె తరుచుగా చుట్టుదారినే వెళ్ళవలిసివచ్చేది. అందుకు రెండు కారణాలు. మొదటిది ఆవీథి అట్టే గౌరవప్రదమయినది కాదు. అంటే మర్యాదస్థులు వెళ్ళడానికి మొగమాటపడేది. ఇక రెండవ అభ్యంతర మేమిటంటే, ఆవీథిలో తన చదువుకొనే రోజుల్లోని నేస్తురాలు నాగమణి ఉంది. ఆమె ఇప్పుడు వృత్తిలో ఉంటున్నదట. దారంట వెళ్ళుతూఉండగా ఆమెగాని పిలిచిందంటే తానే వెళ్ళకుండాఉండలేదు. ...చిన్నప్పటి స్నేహమంటే బాధలేకపోయిందిగాని, ఈవయస్సులో ఆమెలాటి మనిషితో స్నేహం ఉందంటే తనను ప్రతివాళ్ళూ ఒక పురుగుకంటేకూడా హీనంగా చూస్తారే!.........సముద్రంలో ఈతవచ్చీకూడా, ఎక్కువసేపు శక్తికిమించి ఈదటంవల్ల శక్తి ఉడిగి దుర్బలంగా బారలువేసినట్టు ఎలాగో నడిచి చేరుకుంది గమ్యస్థానాన్ని.

సరస్వతి ఎంతో ఆప్యాయంగా పలకరించింది... "ఇంత ఎండలో వచ్చారేమండీ!" అని.

ఆ అమ్మాయిలో ఎంతయినా ఆత్మీయత ఉంది. మొగం కడుక్కుందికి సబ్బూ, తువ్వాలూ అన్నీ అందించి, చిక్కని మజ్జిగ తెచ్చి పుచ్చుకోమంది.

సరస్వతికి బాగా తెలుసు, ఉపాధ్యాయురాలు పాఠంచెప్పే స్థితిలో లేదనీ, ఆ ఉద్దేశంతో రాలేదనీని.

వాళ్ళ నాన్నగారు ఊళ్ళోలేరు. ఉన్నా, డబ్బుయావత్తూ సవతితల్లి శ్యామలాంబచేతిలోనే ఉంటుంది. అక్కడనుంచి డబ్బు ఊడిపడడం ఏమీ సామాన్యమయిన పని కాదు...

ఊరుకోలేక, వసుంధరే, "హార్మోనియమ్ తెస్తావా?" అంది.

సరస్వతి వయస్సులో చిన్నదేకాని ఊహాకలది.

"వద్దండీ, ఇవాళ ఏమీ చెప్పుకోవాలని లేదు" అని, వంటింట్లోకి వెళ్ళి వంటలక్క నరసమ్మగారి నడిగింది...ఇంట్లో సరస్వతీ, నరసమ్మగారూ ఒకపార్టీ; తక్కిన పనిమనుష్యులూ, శ్యామలాంబా ఒకపార్టీ... ఏమయినా, అందరూ నరసమ్మగారినోటికీ, ఆమె యెడల మేజస్ట్రేటుగారికుండే అభిమానగౌరవాలకీ జడిసి ఊరుకొనేవారు.

సరస్వతి తిరిగివచ్చి, "అమ్మగారూ, రండి, నరసమ్మగారు పిలుస్తున్నా"రంది. ఎందుకు, ఏమిటి అని అడగకుండా దుర్బలంగా అనుసరించింది వసుంధర......విస్తరినిండుగా ఉన్న పదార్థాలను చూసి విస్తుబోయింది ఆమె. ఎక్కువ పదార్థాలను ఎట్ట ఎదురుగా చూడటంతోనే ఆమెఆకలి సగం తీరిపోయింది. నాలుగుమెతుకులు ఎల్లాగో నోట్లో పెట్టుకొనేసరికల్లా ఆమె మరి తినలేకపోయింది. ఎలాగో బలవంతంమీద పెరుగూఅన్నం తిని లేచింది. చెయ్యి కడుక్కుంటూ ఉండగా, తొలినాటి రాత్రి "అమ్మ, మరొక్క రొట్టె లేదూ" అని అడిగిన చిట్టితమ్ముడు ఆమెకళ్లలో మెరిసినట్లయింది. వెంటనే కళ్ళల్లో నీళ్లు కమ్మాయి. సరస్వతి అందించిన తువాలుతో చేతులూ మొగం తుడుచుకోవడంలో కళ్లనీళ్లు తుడుచుకొని, అతిప్రయత్నంమీద మళ్లీ రాకుండా నిరోధించుకొంది.

తాను డబ్బు లేకుండా ఇంటికి పోవడానికి ఎంత ఆవేదన పడుతున్నదో, తనకు డబ్బు సరిగా ఇవ్వలేకపోతున్నందుకు సరస్వతికీ అంత బాధగా ఉందని ఆమెకు తెలుసు. అదే ఆమెతృప్తి.

ఆ చిట్టిశిష్యురాలి సానుభూతి అంతటితో ఆగిపోలేదు. మళ్ళీ నరసమ్మగారి దగ్గరకి వెళ్లింది. ఆవిడ సంతోషంగానే పెట్టె తీసి లెక్కపెట్టి ఇచ్చింది. సరస్వతి తన సిల్కుచేతిరుమాలులో మూటకట్టి 'మాష్టరుగారి' చేతిలో ఉంచింది. 'ఏమిటిది' అనడానికిగాని, 'వద్దు' అనడానికిగాని ఉపాధ్యాయురాలికి ఓపిక లేకపోయింది.

శిష్యురాలు హృదయపూర్వకంగా చేతిలో ఉంచిన డబ్బుమూటను పట్టుకొని, ఆమె ఇంటిమొగం పట్టింది. ఈ రెండేళ్లలోనూ ఆమె ఎన్నడూ అంత తొందరగా నడిచిఎరుగదు.

"వసూ ! వసూ!"అన్న పిలుపు ఆమెను నిల వేసింది. ఆ పిలుస్తున్న వ్యక్తిని గూర్చి ఆమెమనస్సు ఆలోచించేలోపునే—

"నువ్వేనా ? అవునా కాదా అని పేరుపెట్టి పిలిచేను. అవుతే వెనక్కి తిరుగుతావనీ, లేకపోతే లేదనీ" అంటూ నాగమణి ఆమెచెయ్యి పట్టుకుంది.

"అప్పటికీ ఇప్పటికీ ఒక్కలాగున్నావే"అంది వసుంధర, రాని నవ్వును తెచ్చుకుంటూ.

ఎన్ని కారణాలు చెప్పినా వెంటనే వెళ్లిపో నివ్వలేదు మణి.

ఒక రెండుగంటలసేపు బాధలకూ, బాధ్యతలకూ అతీతమయిన, ఆ చదువుకొనేరోజులలోని అమాయిక బాల్యానందస్మరణలో వాళ్లిద్దరూ తన్మయులయేరు.

చివరికి "రేపు మళ్లీ వస్తానని ఒట్టుపెట్టుకుంటేనే నిన్నివాళ విడిచి పెడతా"నంది నాగమణి.

"అయితే, నన్ను నమ్మవుటే" అంది వసుంధర.

*   *   *

ఆవేళ ఆమె తమ్ముడికి పొరుగువాళ్ల సుందరం చేత మిఠాయి తెప్పించింది. అమ్మతో "తక్కిన ఖర్చులు ఎలా ఉంటేనేం, ముందు బియ్యమూ, నాన్నకు నల్లమందూ వచ్చేలా చూసిపెట్టమ్మా"అంది.

ఆరాత్రల్లా ఆమెకి నిద్రపట్టలేదు. తమ్ముడు హాయిగా నిద్రపోయేడు. అమ్మకూడా ఇవాళ నిశ్చింతగా పడుకున్నట్టుంది.

తాత్కాలికంగా చేతిలో డబ్బు ఉన్న మాహాత్మ్యం.

మళ్లీ రెండురోజుల్లో మామూలే.

తిరిగి చేతిలోకి వచ్చేదాకా నమ్మకం లేదు.

స్థిరంగా డబ్బువచ్చే సాధనమో !

పాపం, సరస్వతి ఎంత మంచి పిల్ల ! నరసమ్మగారే తనకంటే నయం. అయితే ఆవిడవెనక ఆధార పడిన మనుష్యు లెవరూ లేరు—తానూ ఒంటరిదయితే అంత కష్టం ఉండకపోవును. కుటుంబం-ఏమిటి సాధనాంతరం?

మర్నాడుదయం ఆమె బాగా ప్రొద్దెక్కి లేచింది. రాత్రంతా నిద్రలేకపోవడంవల్ల కళ్ళల్లోకి అదోకవిధమయిన ఎరుపుదనం వచ్చింది...అది తలనొప్పి అనుకోడానికి వీలులేకుండా తల ఏమేమో బాధపెడుతూంది. అయినా, అన్నిటినీ అణచిఉంచే ఏదో ఉత్సాహకిరణము—

అమ్మ చేసిన రొట్టెలు తమ్ముడూ, తానూ, నాన్నా కలిసి తింటున్నసందర్భంలో ఆమె ఏదో చెప్పలేని హాయిని పొందింది. రోజూ ఏదో గొణుగుతూఉండే నాన్న ఆవేళ ఎంతో ఆనందంగా ఉన్నారు.

రోజూ మరి రొట్టెలు లేవని మారాంచేసే రామాన్ని ఆవేళ తినమని ఎంతో బలవంతం చేయవలసి వచ్చింది.

ఆవేళ ఉదయం ఆమె ఎవ్వరిఇంటికీ వెళ్ళలేదు' మధ్యాహ్నంభోజనం అయినతరువాత, ఎనిమిదేళ్ళ క్రిందటి ఏనాంసిల్కుచీర తీసి, చిరుగులు కనబడకుండా కట్టుకొని, తనలో తానే నవ్వుకొని బయలుదేరింది. మళ్ళీ ఏదో ఉద్యోగప్రయత్నంమీద వెళ్తున్నదికాబోలనుకుంది సీతమ్మగారు.

నాగమణి ఎదురుచూస్తూనేఉంది.

"నాకు తెలుసు, నువ్వు వస్తానంటే తప్పక వస్తావని" అంది.

"రాకపోవడం నాతరమా" అంది వసుంధర.

సఖులిద్దరూ మళ్ళీ సంభాషణకి ఉపక్రమించేరు. ఆవేళ సంభాషణ అంతా వ్యాపారపరంగానే నడిచింది.

మూడుగంటలవేళప్పుడు తన చెల్లెలు రత్నం తెచ్చిన కాఫీ అందుకొంటూ, మణి "నువ్వేమంటే అదనుగాని, ఏవృత్తీ అంత తేలికయినది కాదు. దేని కష్టనష్టాలు దానిలో ఉన్నాయి."

"నిజమే, నేను కాదనలేదుగాని, అసలు వృత్తి అని ఒకటి తిన్నగా ఉంటే కష్టంసుఖంమాట తరవాత; ఇప్పుడు నాపని చూడూ, ఉదయంనుండి రాత్రి ఎనిమిదిగంటలదాకా గొంతుచించుకొని అరుస్తాను. లెక్కకేమో ఎనభైరూపాయలు రావాలి. కాని, ఒక్కో నెలలో నలభైముప్పైకూడా దొరకడం దుర్ఘటంగా ఉంటుంది"

"ముప్ఫై, నలభయ్యేనా! నేను ఎంత క్లుప్తంగా చేసినా నెలకి ఖర్చు రెండువందలవుతున్నది. మేమూ ఉన్నవాళ్ళం ముగ్గురమే! నా ఉద్దేశం, ఏదోరకంగా కాస్త సంపాదించుకొని, అంటే ఒక అయిదారేళ్ళు కష్టపడి ఆర్జించి తరవాత ఏ పల్లెటూరుకో పోయి నిశ్చింతగా బ్రతకాలని..."

"మంచికోరికే."

"కోరికలు మంచివైతే ఏమి లాభం? 'సాయీబు సంపాదన బూబమ్మ పోసులకే సరి' అన్నట్టు, నేను తెచ్చేది కాస్తా ఇంటిఖర్చులకే అయిపోతున్నది. నీలాగే ముప్ఫైనలభైతో గడపగలిగితే—"

"నీకు నవ్వుతాలుగా ఉన్నట్టుంది. గడుపుకోవడం అంటే, నేను నీలాగా సిల్కుచీరలూ, పట్టు పరుపులూ ఉండాలనడం లేదుకదూ!"

"వెధవచీరలూ, వెధవపరుపులూనూ! నాకోసం ఏమిటి ? అంతా ఎవళ్ళకోసమో!...... మీనాన్నగారి నల్లమందంటావా ? ఈ ముసలాళ్ళందరిలోనూ ఉన్న పాడుగుణమే ఇది. మా అమ్మకి మూడురోజులకి తులం నర నల్లమందు కావాలి. దాని మిఠాయికీ, తాంబూలానికీ నెలకి అరవై రూపాయలపయిని తగలేస్తుంది."

కాఫీ ఏమీ తాగాలనిపించలేదు వసుంధరకి. బలవంతంగా తాగబోయింది. సగంలో వాంతి వచ్చింది. మణి ఆమెను ఆనుకొనిచూసి, "అబ్భ ! రేమి టీ ఒళ్లు! ఇలా కాగిపోతున్నదే!"అంది...వాంతి అయినతరవాత మొగం కడుక్కొందుకు నీళ్లిచ్చి, మొగం తుడిచి, మెల్లిగా నడిపించుకొనివచ్చి మంచం మీద పడుకోబెట్టింది.

ఒకపావుగంట సర్దుకున్నాక వసుంధర కొంచెం సర్దుకొని, "నేను పోతానమ్మా మణీ"అంది. నాగమణి వెంటనే ఏమీ అనలేదు.

ఆమె మంచంమీంచి లేవబోతూవుండగా, "నీవంట్లో ఇలా ఉండగా, నిన్ను పంపాలని నాకు లేదుగాని మరి నువ్వు వెళ్లకతప్పదంటే నేనేమీ అనలేను"అంది మణి.

"మరేం భయం లేదు. నేను మెల్లిగా వెళ్లిపోగలను."అంది వసుంధర.

ఆమెమాట వినిపించుకోలేదు మణి. జట్కా తెప్పించి తన మెత్తని శాలువ ఒంటిచుట్టూ కప్పి, మెల్లగా జట్కాలోకి ఎక్కించి, తాను కూడా వస్తానంది. కాని, వసుంధర ఒప్పుకోలేదు. పోనీ, మాచెల్లెలు రత్నమేనా నీకూడా రానీ"అంది మణి. "ఎందుకులే, జట్కాలో కూర్చుని వెళ్లిపోవడానికి ఏమిటి కష్టం?" అంది వసుంధర.

ఎలా తాను జట్కా దిగిందో, ఎలా వెళ్ళి మంచంమీద కూలబడ్డదో ఆమె కేమీ తెలీదు.

తరవాత రెండురోజులవరకూ ఆమెకి ఒంటిమీద స్మృతేలేదు.

సీతమ్మగారికి ఒకమాదిరి వెర్రెత్తినట్లయిపోయింది.

రామం దిస్సబోయి ఏమీ అడగడం మాని వేసేడు.

అప్పారావుపంతులు అలా నిర్జీవప్రతిమలా మంచంపక్కను కూర్చున్నాడు.

వసుంధర వెళ్ళినదగ్గరనుండీ నాగమణికి ఒక్కటే ఆందోళన—ఆమెకి ఎల్లా ఉందో అని. ఇంతఊళ్ళో ఎలా వెతకటం ? జట్కావాణ్ణయినా తాను సరిగా చూడలేదు. రెండురోజుల మాటల్లోనూ వీధిపేరయినా కనుక్కోలేదు. ఎంత తెలివితక్కువ! పాపం, ఇంట్లో స్థితి ఎలా ఉందో !

* * *

ఎంతగా తూలిపోయినా, సీతమ్మగారు మనస్సును కూడదీసుకొని కర్తవ్యాన్ని నెరవేర్చింది.

ఆమె చెప్పిచెప్పడంలో డాక్టరు దివాకరం వచ్చిచూసేడు. "టైఫాయిడ్. కాని, మరేమీ భయం లేదమ్మా. తడిగుడ్డ మొగంమీద తరుచుగా వేస్తూ ఉండండి. నేను మందులూ అవీ పంపిస్తాను. మళ్ళీ రాత్రి ఎనిమిదిగంటలప్పుడు వస్తాను" అని వెళ్ళిపోయేడు.

డాక్టరు దివాకరానికి కీర్తీ, అపకీర్తీ రెండూ ఉన్నాయి. మంచి సాధకుడూ, తెలివయినవాడూ, ఎంత ఇచ్చినా అభిమానంగా పుచ్చుకుంటాడు అని కీర్తి: రౌడీల్లో రౌడీ అనీ, తాగుతాడనీ, సానివీధి

అంతా అతడే గుత్తగొన్నాడనీ అపకీర్తి! కాని, దివాకరంస్వభావ మేమిటంటే, ఈకీర్తిని ఎంతగా కాంక్షించగలుగుతున్నాడో ఆ అపకీర్తిని అంతకంటే ఎక్కువగా ప్రేమించగలగటం.

వసుంధరకి అప్పుడప్పుడు తెలివివచ్చేది; కాని, ఆ ఆడుతున్న మాటలకి ఆమెకి అర్థం తెలిసినట్టు లేదు.

డాక్టరు దివాకరానికి ఇంట్లో ముసలితల్లితప్ప మరెవళ్ళూ లేరు. ఆవిడకి సీతమ్మగారంటే ఎంతో అభిమానం. రోజూ కొడుకు ఇంటికి రాగానే ఆవిడ అడిగేది—"బాబూ, వాళ్ళపిల్ల కెలాగుందిరా" అని. దివాకరం శ్రద్ధకు తల్లి అభిమానం తోడుపడింది.

మందుఖర్చులూ, పథ్యపానాలను గూర్చిన ఖర్చులూ తానే స్వయంగా భరించేవాడు దివాకరం. ఇంటికి కావలసినవాటిలో కూడా ఒక కంట చూడమని తల్లితో చెప్పేడు.

సీతమ్మగారిలోనూ, అప్పారావుపంతులులోనూ కృతజ్ఞతాధిక్యం వారి నోటివెంట ఒక్కమాటనుకూడా రానీయ లేదు.

దివాకరానికి తన శక్తిమీదే అపనమ్మకం కలిగేటట్టుంది. అప్పుడప్పుడు అసందర్భంగా కలవరించే కలవరింపుతప్ప తెలివిరావడమే లేదు వసుంధరకి.

ఆవేళ ఉదయంనుండి కదలకుండా కూర్చున్నాడు డాక్టరు దివాకరం. ఎల్లాగో బలవంతపెట్టి అప్పారావుపంతులును భోజనానికి పంపేడు.

మళ్ళీకలవరింత. "మణీ, మణీ, కుటుంబమో...... అసలు వృత్తిహీనం టేకదూ,...........కొనుక్కుంటే, అమ్ముకుంటే, పాపమా......"...దివాకరానికి ఏమీ అర్థంకాలేదు. ఈ మణి ఎవరో తల్లిదండ్రులకికూడా తెలీదు.

"మరేం భయంలేదు. నేనంతా ఆలోచించాను" అంటూ లేవబోయి వెనక్కు పడిపోయింది వసుంధర.

మరొక గంట పోయేక మళ్ళీ—"అమ్మా, తమ్ముడికి మిఠాయి తెప్పించు" అంది బాగా తెలివితో అన్నట్టుగానే. కొంచెంసేపట్లోకే కలవరింత మరీ ఎక్కువయింది—రోదనస్వరంతో.

"మణీ, మణీ, నా కేడబ్బూ వద్దు—నన్నీరాక్షసుడు మింగేస్తున్నాడు, మింగేస్తున్నాడు—"

దివాకరం అప్పటి కేదో మందు ఇచ్చి మళ్ళీ సాయంకాలం వస్తానని వెళ్ళిపోయేడు.

* * *

"మీరుగాని వస్తే, కాఫీ, ఫలహారమూ ఇచ్చి, వచ్చినదారినే సాగనంప మన్నాను మా చెల్లితో-తెలుసునండీ"అంది నాగమణి అప్పుడే చెమటతుడుచుకుంటూ లోనికివచ్చిన దివాకరంతో.

"నాకు కావలసినదే అది. ఇక్కడ అట్టేసేపు కూర్చుందికి నాకు తీరుబాటులేదు." అంటూ పడకకుర్చీలో కూలబడ్డాడు దివాకరం.

అతని చేతిలోని రుమాలు అందుకొని, తానే తుడిచి, విసనకర్రతో విసరుతూ అడిగింది "ఏమిటో ఆ తొందరకదా ?"అని.

"ఏమిటా ? ఏమీలేదు. ఒక ప్రమాదమయిన కేసుంది. అందులో నీ సహాయం ఏమయినా ఉపయోగిస్తుందేమోనని."

"నాసహాయమా? ఏమి, ఎవరయినా కవికుమారుడు విరహజ్వరంతో బాధపడుతున్నాడేమిటి?"

"ఊఁహు. ఇది చాలా కరుణజనకమయినదిలే. పాపం, ఒక ఇరవైఏళ్ళ అమ్మాయి..."

"మరేం, మీ రొట్టె విరిగి నేతిలో పడిందన్నమాట. అందుకేమరి ఇన్నాళ్ళూ దర్శనాలుః లేవు" అంది ఉల్లాసంగా మణి.

తీవ్రంగా మొగంపెట్టి, "చెప్పేది చివరంటా వినకుండానే నవ్వుతావు. అందికే నాకు అసహ్యం" అన్నాడు డాక్టరుసాహేబు.

అమాయికంగా 'అయ్యో' అంది నాగమణి.

"పాపం, ఆ అమ్మాయే ఆయింటికి ఆధారం. ఒక ముసలితండ్రి ఉన్నాడు, ఎందుకూ పనికిరాడు."

" ఆఁఆఁ, ఏమిటి, ఆ అమ్మాయి పేరేమిటన్నారు?"

"ఆ అమ్మాయిపేరేమిటో నాకుతెలీదు; కాని వాళ్లమ్మగారి పేరు సీతమ్మగారట. ఆ అమ్మాయి గర్ల్స్‌స్కూల్లో సంగీతం చెప్పేదిట—"

మరి అనుమానం లేకపోయింది నాగమణికి.

"అయితే మా వసుంధరే. ఎలా ఉందేమిటి ? మరేం ప్రమాదం లేదుకదా ?"

"ఏమిటో చెప్పలేము. ఇదివరకు కొంత ధైర్యంగా ఉండేదిగాని, నిన్నటినుండీ మరీపాడుగా ఉంది; ఇవాళ ఉదయం 'మణీ, మణీ' అని కలవరించింది, నీ గురించే కాబోలు"

"నిజమే. పదండి వేగం. ఆవేళ పాపం ఇక్కడినించి వెళ్లేవేళకే విపరీతమయిన జ్వరం. నన్ను కూడా దిగబెట్టనివ్వింది కాదు. ఏ వీధిలో ఉన్నారో కూడా తెలీదు. ఆ వెధవజట్కావాణ్ణి వెతికించేను. వాడూ కనబడలేదు. పదండి వేగం."

"ఉండు, ఒక్కనిమిషం — కళ్లు మండుతున్నాయి. రాత్రల్లా నిద్రసరిగా లేదు."

'పాపం' అంది ఎంతో అభిమానంగా మణి తల పట్టుతూ.

* * *

దివాకరం ఇచ్చిన ఇంజక్షనుతో అంతచక్కగా తెలివిరావడం అందరికీ ఎంతో ఆశ కలిగించింది. కాని అతడికిమాత్రం లోలోపల అనుమానంగానే ఉంది.

"మణీ, వచ్చావా, వచ్చావా? నేనేమీ చెడిపోలేదుకదూ" అంది వసుంధర.

మణి మాట్లాడలేక, కన్నీళ్లను ఆపుకోలేక మొగం పక్కకు తిప్పుకుంది.

తరవాత మరొక్కక్షణం కళ్లు మూసుకొని, తెరిచి, "అమ్మా, తమ్ముడేడీ" అంది వసుంధర.

వెలవెలబోతూ దగ్గరకు వచ్చి నిలబడ్డాడు రామం.

"రామం, ఇదుగోనమ్మా, మరో అక్కయ్య. నేను లేకపోయినా, ఈ అక్కయ్య నీకు రోజూ అన్నీ కొనిపెడుతుంది" అని మరి మాట్లాడలేకపోయింది.

అందరూ ఏడిస్తే, ఎందుకో తెలియకుండానే తానూ కళ్లలో నీళ్లునించుకున్నాడు రామం.

* * * *

కుటుంబంలో ఒక మనిషి తగ్గిపోయేసరికి అంతకంటే తక్కువ బంధమూ, ఎక్కువ ఆర్థికసాధన సంపత్తీ గల ఇంకొక మనిషి వచ్చింది.

రామానికి తగని ముద్దు జరగటంవల్ల చదువు సరిగా అంటలేదు; కాని, ఇరవైయేళ్లు వచ్చేలోపునే తెలుగుదేశంలో అతని పేరు బాగా వ్యాపించింది మంచి ఫ్లూటు (వేణువు) వాద్యకుడుగా. కాని, అతడికి ఎన్నడూ కుటుంబాన్ని పోషించవలసిన అగత్యం కలగలేదు. అతడు చేయవలసిన తప్పనిసరిపని ఏమిటంటే? నెలరోజులకొకమారు వెళ్లి అక్కయ్య మణి పెట్టిన మిఠాయి కడుపునిండా తినడమే.

వసుంధర పోయినతరవాత మణి అనుకుంది — "నావృత్తి మంచిదో చెడ్డదో, నా కిప్పుడే సంకోచమూ లేదు. ఏమంటే, మునపటిలా నాసుఖంకోసమే నేను పాటుపడలేదు; నన్ను అంటిపట్టుకొని ఉన్న అమాయికమయిన కుటుంబాన్ని పోషించడంకూడా ఇప్పుడు నాకర్తవ్యాల్లో ఒకటి. ఎవరి కుటుంబాన్ని వాళ్లు పోషించుకోవడంలో ఏమి తప్పుంది?" అని.

నాగమణిలో ఏదయినా విచారం ఉంటే అది, తన చెల్లెలు రత్నాన్ని తన వృత్తిలో దిగకుండా కాపాడలేకపోవడమే.

అప్పారావుపంతులూ, సీతమ్మా ఎప్పుడెప్పుడని రోజులు లెక్కపెట్టుకుంటూనే కొన్ని సంవత్సరాలు, విచారంలేకుండా కాకపోయినా, డబ్బుకు సంబంధించిన వడిదుడుకులూ, వేదనా లేకుండా బ్రతికేరు.

కొన్నాళ్లపాటు అప్పారావుపంతులుకి అభిమానంగా ఉండేది. ఆవిధంగా ఏమీ సంబంధం లేని, ఎవరో అమ్మాయిమీద ఆధారపడటం. కాని, క్రమంగా, అతడామెను ఎవరో అన్నట్లు కాకుండా, అత్యంత ఆత్మీయురాలుగా భావించేస్థితికి వచ్చేడు.

కాని సీతమ్మగారి గుండెల్లో తగిలిన గాయం ఇంకా బలమైనది. ఆమెమనస్సులో మణి అంటే ఏదో చెప్పలేని అభిమానమూ, ఆమె నిర్వ్యాజంగా చేస్తున్న సహాయానికి కృతజ్ఞతాభావమూ రేకెత్తేది అతిఉజ్జ్వలంగా. కాని, ఆమెలోపల్లోపల వసుంధర నీడలు చెరిగిపోలేదు. జీవితంలోని అత్యంతమధురమయిన భాగమంతా తలకుమించిన భారంతో క్రుంగిపోతూకూడా తమకోసం, లేని ఉత్సాహంతో ఆజీవితాంతమూ ఆవేదనపడిన ఆకూతురును తలచుకోని క్షణమే ఆమె శేషజీవితంలో లేదనడం అతిశయోక్తి కాదు.